## మన(సు)లో మాట

పాఠకులందరికీ సంఘమిత్ర ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేస్తోంది. సంఘమిత్ర స్వచ్ఛంద సేవకుల పని వత్తిడి వలన సకాలములో అన్ని శీర్షికలూ ప్రచురించుటకు వీలు పడడములేదు. సంఘమిత్ర బృందం మీ ఆసక్తికి, శీర్షికలు పంపుటద్వారా సంఘమిత్ర పత్రిక వెలువరించడానికి పాలు పంచుకొంటున్నందుకు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నది. సంఘమిత్ర త్రైమాసిక పత్రిక ఐదు సంవత్సరములు పూర్తి చేసిన సందర్భములో శుభాకాంక్షలు పంపిన పాఠకులకు ధన్యవాదములు.

సంఘమిత్ర స్వచ్ఛంద సేవకులలో ఒకరు అమెరికాలోని ఒక ప్రాంతములోని పాఠశాలలో బోధనా పద్ధతులను మార్చడానికి ఆ కార్యవర్గానికి సిఫారసు చేస్తున్నారన్న విషయము గత సంచికలో చెప్పియున్నాము. ఆయన అందజేసిన అతి విలువైన సూచనలను పాఠశాల కార్యవర్గం అంగీకరించే అవకాశము మెండుగా నున్నది. 'గణితము నేర్పించడానికి అనుసరించవలసిన పద్ధతుల' గురించి నిర్వహిస్తున్న సమీక్షలను చాలామంది అభినందిస్తున్నారు. ఎందరో పిల్లలు దీనివలన ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఈ మధ్య "A splash of India" అనే పత్రిక వేదగణితమునకు సంబంధించిన విజ్ఞానము గురించి అందరికీ తెలియవలెననే తలంపుతో ఒక ఇంటర్వ్యూను ప్రచురించింది. వివరములకు http://www.asplashofindia.com/profiles/an-interview-with-sreenivasa-ainapurapu ను చూడండి.

అమెరికా ఆర్థిక సంక్షోభమునుండి బయటపడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. అక్కడక్కడ ఉద్యోగుల కొఱకై ప్రకటనలు వెలువడుతున్న పరిస్థితి శుభ సూచకము. చిగురంత ఆశ జగమంత వెలుగు అన్నది అక్షరసత్యము. కావున ఆశ నిరాశ కాకుండా జాగ్రత్త పడడం చాలా అవసరం.

చాలామంది పాఠకులు ముఖచిత్ర కథనము బాగుందని తెలియజేసారు. కొంతమంది అన్ని శీర్షికలు ప్రచురించనందుకు అసహనాన్ని వ్యక్త పరిచారు. ఈ విషయములో మా ప్రయత్నం మేము చేస్తున్నాము. కాని, కావలసినంత మంది వ్యక్తులు లేకపోవడము వలన పత్రికను సకాలములో ప్రచురించడానికి కష్టమవుతున్నది. ఈ విషయములో పాఠకుల అండదండలు చాలా అవసరము.

పాఠకులందరికి మరొకసారి వారి రచనలను పంపడానికి ఆహ్వానిస్తున్నాము. మీకు తెలిసిన విషయములను మిగిలిన పాఠక సోదరులతో పంచుకోడానికి ఇది చక్కని వేదిక. మీరు మీ ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలని అనుకుంటే ainapura@yahoo.com కి ఈ-మెయిలు పంపండి.

మళ్ళీ ఉగాది సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.